


ఊరించి.. టమా'రా'!

కేవలం రెండు వారాల వ్యవధిలోనే టమాట ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



రెచ్చిపోతున్న ఇసుక మాఫియా!

గంగవరం మండలంలో కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక మాఫియా యథేచ్ఛగా రెచ్చిపోతోంది. - 8లో



మొరాయించిన అటెండెన్స్ యాప్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అటెండెన్స్ యాప్ మంగళవారం మొరాయించడంతో టీచర్లు ఇబ్బంది పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

రిజిస్ట్రేషన్లకు సర్వర్ కష్టాలు



చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వినియోగదారుల పడిగాపులు

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 4 రోజులుగా సర్వర్ సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరగక విక్రేతలు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని పలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సమస్య సతాయిస్తోందని అధికారులు అంటున్నారు. సైట్ నెమ్మదించడంతో పలు కార్యాలయాల్లో సేవలు స్తంభించాయని వెల్లడిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ కోసం వేచి చూడాల్సి వస్తోందని వినియోగదారుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నారని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

15న అప్రెంటిస్ పోస్టులకు ఇంటర్వ్యూలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆర్టీసీలో అప్రెంటిస్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 15వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీపీటీఓ జగదీష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు సర్టిఫికెట్లతో నెల్లూరు సమీపంలోని కాకుటూరు జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఇంటర్వ్యూకు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు.

73 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న యుగంధర్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 73 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సీడప్ రీజనల్ ప్లేస్‌మెంట్ అధికారి యుగంధర్ బాబు తెలిపారు. 5 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మజ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, ఐటీఐ ప్లేస్‌మెంట్ అధికారి మురళీకృష్ణ, ఏపీ ఎస్‌ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య పాల్గొన్నారు.

పది పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువును పెంచినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ మేరకు విద్యార్థులు 18వ తేదీలోపు ఫీజు చెల్లించే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. రూ.50 అపరాధ రుసుముతో 19 నుంచి 25వ తేదీలోపు, రూ.200 అపరాధ రుసుముతో 26 నుంచి డిసెంబర్ 3వ తేది వరకు, రూ.500 ఫైన్‌తో డిసెంబర్ 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వివరించారు. రెగ్యులర్ అభ్యర్థులకు అన్ని సబ్జెక్టులకు రూ.125, 3 సబ్జెక్టులకు పైగా ఉంటే రూ.125, అంతకంటే తక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.110, ఒకేషనల్ అభ్యర్థులకు అదనంగా రూ.60, తక్కువ వయసు కలిగిన విద్యార్థులకు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం అవసరం అయితే రూ.80 చొప్పున ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి సమాచారం కోసం www. br-e.a p.g-ov.i n వెబ్‌సైట్ సందర్శించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేధింపులుంటే 'షీ బాక్స్'లో అప్‌లోడ్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాశాఖ కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపులుంటే వెంటనే షీ బాక్స్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఎక్కడైనా వేధింపుల ఘటనలు ఉంటే పూర్తి సమాచారాన్ని వెంటనే అప్‌లోడ్ చేయాలని పేర్కొంది.

8న పలమనేరులో జాబ్‌మేళా

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 8వ తేదీన మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ సౌజన్యంతో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరివర్తన

- కటకటాల బతుకులను ఉన్నతంగా మారుస్తున్న జైలు
- అధికారుల ప్రోత్సాహంతో ఖైదీలకు భవిష్యత్‌పై చిగురిస్తున్న ఆశలు
- శిక్షా కాలంలో పని చేసుకుని వేతనం పొందే వెసులుబాటు
- ఆసక్తి ఉంటే చదువుకునే అవకాశం
- తొలి బ్యాచ్‌లో పదో తగరతి ఉత్తీర్ణులైన 11 మంది ప్రిజనర్స్
- ఆదర్శంగా నిలుస్తున్న చిత్తూరు జిల్లా జైలు

■ భాస్కర్.. ఆరేళ్ల క్రితం జరిగిన ఓ దొంగతనం కేసులో నిందితుడు. నేరం రుజువు కావడంతో కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. కుటుంబానికి దూరంగా, నాలుగు గోడల మధ్య జైలు జీవితం అనుభవించాడు. అయితే కారాగారంలో ఉన్నప్పటికీ తన చిరకాల కోరికను నెరవేర్చుకున్నాడు. అధికారుల ప్రోత్సాహంతో పదో తరగతి పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు. సంతోషంగా ఇటీవలే జైలు నుంచి విడుదలై తన కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నాడు.



అక్షరాలు దిద్దుతున్న ఖైదీలు

■ హనుమ (పేరు మార్చాం) ఓ హత్య కేసులో నేరం రుజువు కావడంతో కోర్టు జీవిత ఖైదు విధించింది. ఇక తన బతుకు కటకటాల మధ్యే సరిపోతుందని, భార్య, పిల్లలను చూడకుండా జైలు పక్షిగానే మిగిలిపోతానని మథన పడ్డాడు. అయితే జైలులో సత్ప్రవర్తన కారణంగా కడప సెంట్రల్ జైలు నుంచి చిత్తూరు ఓపెన్ ఎయిర్ జిల్లా జైలుకు పంపించారు. గత మూడేళ్లుగా ఇక్కడున్న పెట్రోలు బంకులో బాయ్‌గా పనిచేస్తూ ప్రతినెలా వచ్చే జీతాన్ని తన కుటుంబానికి పంపుతున్నాడు. జన జీవనంలో కలిసిపోయి ఖైదీని అనే భావన రాకుండా ఆనందంగా ముందుకు సాగుతున్నాడు.

చిత్తూరు జిల్లా జైలు ఆదర్శవంతంగా కార్యాచరణ అమలు చేస్తోంది.. కరడుగట్టిన మనసులను కరిగిస్తోంది.. జీవితఖైదు అనుభవిస్తున్న వారిలో సైతం పరివర్తన తీసుకువస్తోంది.. నాలుగు గోడల నడుమ బతుకులు నలిగిపోకుండా భవితకు భరోసా కల్పిస్తోంది.. శిక్ష పడడంతో ఇక అంతా ముగిసినట్టే అనుకుని నైరాశ్యంలో మునిగిపోయిన వారిని ఉత్తేజపరుస్తోంది.. కటకటాల నడుమ కమ్ముకున్న చీకట్లను పారదోలి ఖైదీల జీవితాల్లో సరికొత్త వెలుగులు ప్రసరింపజేస్తోంది.. భార్యాబిడ్డలకు దూరంగా ఉన్నప్పటికీ కుటుంబానికి ఆర్థికంగా చేదోడుగా నిలిచేందుకు ఉపాధిని అందిస్తోంది. కారాగారంలో మగ్గిపోకుండా ఉన్నతంగా చదువుకునే అవకాశమిచ్చి సత్ఫలితాలను సాధిస్తోంది.

చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని గిరింపేట వద్ద సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో జిల్లా జైలు ఉంది. దాదాపు 200 మందికి పైగా అండర్ ట్రయల్, నేరం రుజువు కావడంతో శిక్ష పడిన ఖైదీలు ఉన్నారు. వీరిరలో చాలా మందికి ఏవో పనులు చేసుకోవాలనే ఆశ ఉంటుంది. మరి కొంత మందికి చదువుకోవాలనే కోరిక ఉంటుంది. అయితే క్షణికావేశంలో చేసిన తప్పులకు జైల్లోని నాలుగు గోడల మధ్యే జీవితం ముగిసిపోతోందని నిరాశావాదంతో కొట్టుమిట్టాడుతున్న వాళ్లు ఉంటారు. ఎక్కడ పడ్డామో అక్కడి నుంచే పైకి లేచి నిలబడాలని, ఏదో ఒకటి సాధించి జైలు నుంచి బయటకు వెళ్లాలని పట్టుదల కొందరిలో ఉంటుంది. ఇలాంటి ఖైదీలకు జైలు అధికారులు బాసటగా నిలిచారు. కారాగార జీవితం అంటే ఖైదీల్లో పరివర్తన తీసుకురావడమనే కోణంలో ముందడుగు వేశారు. ఖైదీలతో మనసువిప్పి మాట్లాడి, వారి భావాలకు అనుగుణంగా బాటలు వేసేందుకు భరోసా ఇచ్చారు.



చిత్తూరులోని జిల్లా జైలు, పక్కనే పెట్రోలు బంకు

ఉపాధికి బాసట

పెద్ద కేసుల్లో నేరం రుజువైతే ఏడేళ్ల నుంచి జీవిత ఖైదు శిక్ష కూడా పడుతుంది. అలాంటి వారి మానసిక పరిస్థితి చాలా నిర్లిప్తంగా ఉంటుంది. జీవితం నాశనం అయిపోయిందనే భావనతో ఉంటారు. అయితే వీరిలో ప్రతికూల ఆలోచనలను తొలగించేందుకు జైలు అధికారులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. రోజు వారీ పనులను సక్రమంగా చేసుకుంటూ, సత్ప్రవర్తనతో మెలుగుతున్న ఖైదీలను ముందుగా గుర్తించారు. అందులో భాగంగానే కడప సెంట్రల్ జైలు నుంచి వచ్చిన ముగ్గురు ఖైదీలను చిత్తూరులోని జిల్లా జైలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో బాయ్స్‌గా నియమించారు. వీరికి ప్రతి నెలా జీతం ఇస్తున్నారు. సమాజంలో ఉంటూ జీవనం సాగించే అవకాశం కల్పించారు. జైలులో ఉన్నప్పటికీ తమ కుటుంబాలకు ఆర్థికంగా బాసటగా నిలిచే వెసులుబాటు ఇచ్చారు.

కలెక్టర్, జిల్లా జడ్జి చేతులు మీదుగా టెన్త్ సర్టిఫికెట్ అందుకుంటున్న దృశ్యం



తొలి ప్రయత్నంలోనే..

జైలు అధికారుల ఉన్నత ఆలోచనల నుంచి పుట్టిందే సార్వత్రిక విద్య (ఓపెన్ ఎడ్యుకేషన్) విధానం. చదువుకోవాలనే బలమైన కోరిక ఉన్న వాళ్లను పదో తరగతి ఉత్తీర్ణులయ్యేలా చూడాలని భావించారు. వచ్చామా, శిక్ష పూర్తయ్యాక.. కేసు కొట్టేసిన తర్వాత వెళ్లిపోయామా అని కాకుండా జైలులో ఉన్న రోజుల్లో కనీసం పదో తరగతి పాసయితే, బయటకు వెళ్లాక ఎదైనా చిన్న పని దొరికే అవకాశం ఉందని ఖైదీల్లో ఆలోచనను రేకెత్తించారు. దీంతో తమకు చదుకోవాలనే ఆశ ఉందని 12 మంది ఖైదీలు ముందుకొచ్చారు. ఆలస్యం చేయకుండా ఓపెన్ స్కూల్ పద్ధతిలో అధికారులు అడ్మిషన్లు ఇప్పించారు. పరీక్షలకు సన్నద్ధం చేశారు. జైల్లోనే ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయించి, పరీక్షలు రాయించారు. ఇంకేముంది తొలి ప్రయత్నంలోనే 11 మంది ఖైదీలు పదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. ఇది ఖైదీలు, జైలు అధికారులకు కొత్త ఉత్సాహం ఇచ్చింది. భవిష్యత్‌లో జైలు నుంచే ఉన్నత విద్యను సైతం అభ్యసించాలనే ఆకాంక్షను ఖైదీల్లో బలంగా తీసుకువచ్చింది. ఈ మేరకు అండర్ ట్రయల్, నేరాల్లో శిక్ష అనుభవిస్తున్న 11 మంది తొలి బ్యాచ్‌లో పదో తరగతి పాసయ్యారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి వేడుకల్లో కలెక్టర్, జిల్లా జడ్జి చేతులు మీదుగా పదో తరగతి పాసైన సర్టిఫికెట్లు అందుకున్నారు. తోటి ఖైదీల్లో సైతం గొప్ప మార్పునకు, పరివర్తనకు నాంది పలికారు.



యోగా చేస్తున్న ఖైదీలు

ఆవేశంలో చేసిన తప్పు



నాకు 24 ఏళ్ల వయసప్పుడు క్షణికావేశంలో చేసిన హత్యకు కోర్టు లైఫ్ (జీవిత ఖైదు) వేసింది. తొమ్మిదేళ్లుగా శిక్ష అనుభవిస్తూనే ఉన్నా. కడప సెంట్రల్ జైలులో నా ప్రవర్తన చూసిన ఆఫీసర్లు చిత్తూరు జిల్లా జైలుకు పంపించారు. మూడేళ్లుగా జైలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో పనిచేసుకుంటూ బతుకున్నా. వచ్చే జీతంలో కొంత నా భార్య, బిడ్డలకు పంపిస్తున్నా. ఈ జీవితం చాలా నేర్పించింది. మరోసారి తప్పు చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నా.

– యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ

బాధేస్తోంది..



నేను హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నా. ఆరేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉన్నా. నా ప్రవర్తన బాగుండడంతో పెట్రోలు బంకులో పని చేసే అవకాశం ఇచ్చారు. తప్పు చేసి నేను ఏం కోల్పోయానో ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది. ఆలోచిస్తే చాలా బాధేస్తోంది. అయితే ఇప్పుడు పనిచేసుకుంటూనే చుట్టుపక్కల వాళ్లను చూస్తూ బతుకుతున్నాం. జైల్లో ఉన్నామని అనిపించడంలేదు. నాకంటూ కొంత డబ్బును బ్యాంకులో పొదుపు చేసుకుంటున్నా.

– జీవిత ఖైదు పడిన ఓ ఖైదీ

మార్పే మా లక్ష్యం



జైలు అంటే శిక్షించేది కాదు. ఖైదీల్లో మార్పు తీసుకురావడమే మా లక్ష్యం. ఇందు కోసం ముందుగా ఆసక్తి ఉన్న వాళ్లకు చదువు చెప్పించాలని భావించాం. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో 11 మంది టెన్త్ పాసవడం మాకు చాలా సంతోషానిచ్చింది. మోడల్ జైలు ప్రతిపాదన ఉంది. అది పూర్తయితే జైల్లోనే ఫ్యాక్టరీలు పెట్టి బీరువాలు, సోఫాలు, క్యాండిల్స్, బెడ్‌షీట్స్ లాంటి వస్తువులను ఖైదీల ద్వారా తయారుచేయిస్తాం. ఇపుడు నడిపిస్తున్న పెట్రోలు బంకు నుంచి వచ్చే ఆదాయం కూడా ఖైదీల సంక్షేమం కోసమే వినియోగిస్తున్నాం. జైలు జీవితంతో కథ ముగిసిపోయినట్టుకాదు. మారిన మనుషులకు కొత్త జీవితం ప్రారంభించే అవకాశమివ్వడమే జైలు ఉద్దేశం.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా జైళ్ల అధికారి, చిత్తూరు

ఆశ నిరాశల 'డీఎస్సీ'

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. నాలుగు నెలలుగా మాటలతో కాలక్షేపం చేసిన కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ప్రక్రియకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల గుర్తింపు పూర్తి చేసినట్లు అధికార యంత్రాంగం వెల్లడించింది. అయితే ఎస్‌జీటీ పోస్టులే అధికంగా ఉండడంతో బీఈడీ అభ్యర్థుల్లో నిరాశ పెల్లుబుకుతోంది. స్కూల్ అసిస్టెంట్ స్థానాలు తక్కువగా ఉన్నట్లు తెలియడంతో వారిలో అసహనం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది డీఎడ్ అభ్యర్థులకే అవకాశం దక్కనుంది.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,473 ఖాళీల గుర్తింపు
- ఎస్‌జీటీ–930, ఎస్‌ఏ–543 పోస్టుల భర్తీకి అవకాశం
- డీఎడ్ అభ్యర్థుల మోదం.. బీఈడీ అభ్యర్థుల ఖేదం!
- నివేదికలు పంపిన విద్యాశాఖ అధికారులు
- ఇప్పటికే వెల్లడైన టెట్ ఫలితాలు
- నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీకి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విషయం విదితమే. ఆ మేరకు సీఎం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన రోజే సంబంధిత ఫైల్‌పై తొలి సంతకం చేశారు. అయితే నాలుగు నెలలు ముగుస్తున్నా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఊసేలేదు. టెట్ పరీక్ష ఫలితాలు సైతం విడుదలయ్యాయి. ఈ క్రమంలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచర్ పోస్టుల ఖాళీలను గుర్తించారు. దీనిపై నివేదికలను సైతం పంపించారు.

ఉమ్మడి జిల్లాలో గుర్తించిన పోస్టులు

పోస్టు	జెడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు	మున్సిపల్/ నగరపాలక స్కూళ్లు	మొత్తం
ఎస్‌జీటీ	820	110	930
స్కూల్ అసిస్టెంట్ హిందీ	12	10	22
ఇంగ్లిష్	100	05	105
గణితం	28	05	33
ఫిజిక్స్	28	01	29
జువాలజీ	58	10	68
సోషల్	120	12	132
ఫిజికల్ ఎడ్యుకేషన్	86	01	87
ఇతర కేడర్	45	22	47
మొత్తం	1,297	176	1,473



పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

వివిధ కేడర్‌ల వారీగా భర్తీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 7,757 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా బడుల్లోని ఖాళీలను గుర్తించే ప్రక్రియను అధికారులు పకడ్బందీగా చేపట్టారు. 2025 ఏప్రిల్ 30వ తేదీ వరకు ఏర్పడే ఖాళీలను అనుసరించి డీఎస్సీ పోస్టుల భర్తీకి కసరత్తు చేశారు. ఈ ప్రక్రియలో మొత్తం 1,473 పోస్టులు వివిధ కేడర్‌లలో ఖాళీగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.

ఎస్‌జీటీ పోస్టులే అధికం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహించబోయే డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులనే అధికంగా భర్తీ చేయబోతున్నారు. మొత్తం 1,473 పోస్టులకు గాను వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులు 543 ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 930 పోస్టులు ఎస్‌జీటీ కేడర్ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ డీఎస్సీలో డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులే ఎక్కువగా పోటీ పడనున్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తక్కువగా ఉండడంతో బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు మరోసారి నిరాశే మిగిలింది.

నిబంధనల ప్రకారం కసరత్తు



ఉన్నతాధికారులు సూచించిన నిబంధనల ప్రకారం కసరత్తు నిర్వహించాం. ఈ మేరకు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపించాం. వారు మరో పర్యాయం క్షుణ్ణంగా నివేదికలను పరిశీలించి డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఖాళీలను ప్రకటిస్తారు. – వెంకటేశ్వరరావు, ఏడీ, డీఈఓ కార్యాలయం, చిత్తూరు

'పరపతి' పెరిగేలా బలోపేతం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 3.6లక్షల మంది రైతుల్లో 1.90 లక్షల మంది మాత్రమే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో సభ్యత్వం ఉందన్నారు. రైతులు వారికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు సంఘాల ద్వారా రుణాలు పొందుతున్నారని చెప్పారు. ఈ సంఘాల ద్వారా బహుళార్థక సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. నాబార్డు ఆధ్వర్యంలో సాయం పొందే వెసులుబాటును రైతులు సద్వినియోగం చేసుకునేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నాబార్డ్ నిధులతో నిర్మించిన గోడౌన్‌లను వ్యవసాయ అనుబంధ శాఖలు, ఐసీడీఎస్, హౌసింగ్ శాఖల సామగ్రిని భద్రపరచుకునేందుకు సంబంధిత అధికారులతో చర్చించాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ నాగవల్లి, నాబార్డు ఏజీఎం సునీల్, డీసీసీబీ సీఈఓ మనోహర్ గౌడ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

విజయపురం : ఆధునిక పద్ధతులతో చెరుకు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ బక్షీరామ్ తెలిపారు. మంగళవారం మండలంలోని మంగళం కండ్రిగలో నింద్ర సాగర్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం వారు నగరి, పిచ్చాటూరు డివిజన్ చెరుకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బక్షీరామ్ మాట్లాడుతూ. సాధారణ పద్ధతిలో 25 అడుగులు వెడల్పుతో బోదె తోలి చెరుకు నాటుతున్నారని, దీంతో కేవలం ఎకరాలకు 40 టన్నుల దిగుబడి మాత్రమే వస్తోందన్నారు. కొత్త విధానంలో 4 నుంచి 5 అడుగుల వెడల్పుతో బోదె తోలి చెరుకు విత్తితే ఎకరాకు 60 నుంచి 70టన్నుల దిగుబడిని పొందవచ్చని వెల్లడించారు. ఈ పద్ధతిలో చెరుకు సాగు చేస్తే యంత్రాలతో హార్వెస్టింగ్ చేయవచ్చని వివరించారు. ఇందుకోసం విత్తనం కూడా ఎకరాకు రెండు టన్నులే సరిపోతుందని, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. అలాగే సూపర్‌ఫాస్ఫేట్, యూరియా, పొటాష్ లాంటి ఎరువులను నాలుగు విడతలుగా వాడాలని సూచించారు. చెరుకు తోట వదిలే సమయంలో ఆకును కాల్చకుండా వదిలేస్తే, అది కుళ్లి భూసారం పెరుగుతుందని తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీ అడ్వైజర్ కృష్ణన్ , ఏజీఎం వరదరాజన్ మాట్లాడుతూ 3 అడుగుల వెడల్పుతో బోదె తోలి విత్తనం విత్తితే ఎకరాకు రూ.5వేలు 45 అడుగుల వెడల్పుతో బోదె తోలితే ఎకరాకు రూ.10వేల సబ్సిడీ అందిస్తామన్నారు. ఈ ఏడాది టన్నుకు రూ.3,151 ఇస్తున్నామని, రవాణా చార్జీల కింద రైతులు రూ.127 చెల్లిస్తే చాలని వెల్లడించారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త బక్షీరామ్

క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టి.. విధులకు గైర్హాజరు!


మూతవేసిన ఉర్దూ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా అఫ్సర్ ఖాన్ అక్టోబర్ 26వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. అయితే అప్పటి నుంచి ఒక్కరోజు కూడా కార్యాలయంలో విధులకు హాజరైంది లేదు. జిల్లాలో ఉర్దూ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాల్సిన ఆయన విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, హాజరు పెంచడం సంగతి దేముడెరుగు, సదరు అధికారే విధులకు గైర్హాజరవుతుండడంతో ఉర్దూ కార్యాలయం రోజూ మూతపడే ఉంది.

మొరాయించిన అటెండెన్స్ యాప్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అటెండెన్స్ యాప్ మంగళవారం మొరాయించింది. దీంతో ఉదయం పాఠశాలలకు వెళ్లిన టీచర్లు హాజరు నమోదు చేయలేక అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని డీఈఓ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం స్పందన లేకుండా పోయింది. చివరకు మధ్యాహ్నం ఒంటి గంటకు యాప్ పనిచేయడంతో అప్పుడే అటెండెన్స్ నమోదు చేశారు. అటెండెన్స్ యాప్ తరచూ టెక్నికల్ సమస్యతో ఇబ్బంది పెడుతున్నట్లు టీచర్లు వాపోతున్నారు.

జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు పలమనేరు విద్యార్థి


చక్రి

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి చక్రి జాతీయ సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి అనంతపురంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో చక్రి పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ దాడులు

- భారీగా మద్యం సీజ్
- నిర్వాహకులందరూ తమ్ముళ్లే!

పలమనేరు : పలమనేరు పరిధిలోని పలు చోట్ల నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై ఎక్సైజ్, స్క్వాడ్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా దాడులు చేశారు. పట్టణంలోని గొబ్బిళ్లకోటూరుకు చెందిన టీడీపీ నాయకుడు సొట్ట సుబ్రమణ్యం(68), ఆయన భార్య నుంచి 22 బాటిళ్లు, గంగవరం మండలం కేఎం పెంటకు చెందిన సుబ్రమణ్యం నుంచి 25 బాటిళ్లు, బైరెడ్డిపల్లిలో మంజునాథ నుంచి 25 సీసాల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వీరింతా కూటమి నేతలకు చెందిన వైన్ షాపుల నుంచి మద్యం తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్, స్థానిక సీఐ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఎక్సైజ్ అధికారులు పట్టణ సమీపంలోని బార్‌ను, రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.

ఊరించి.. టమా‘రా’!

టమాట ధర రైతులను ఊరించి.. ఉసూరుమనిపించింది. ఒక్కసారిగా ఆకాశాన్నంటి.. ఉన్నట్టుంది కిందకు పడిపోయింది. బాక్సు రేటు రూ.600 నుంచి రోజుల వ్యవధిలోనే రూ.300కి దిగిపోవడంతో అన్నదాతలకు దిక్కుతోచని స్థితి ఎదురవుతోంది. ఇదే సమయంలో ఎగుమతులు సైతం తగ్గిపోవడంతో గిట్టుబాటు దక్కడం కష్టంగా మారింది. బయటి వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు రాకపోవడంతో ధర పతనావస్థకు చేరింది. ఉత్తరాది రాష్ట్రాల్లో టమాట సీజన్ ప్రారంభం కావడమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది.


పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాట

- రెండువారాలకు ముందు బాక్సు రూ.600 పైగానే
- ప్రస్తుతం రూ.300కి పడిపోయిన ధర
- భారీగా తగ్గిన ఎగుమతులు
- నష్టాల బారిన రైతులు
- ఉత్తరాది రాష్ట్రాల్లో సీజన్ మొదలవడమే కారణం

పలమనేరు : పలమనేరు హార్టికల్చర్ డివిజన్ పరిధిలో రెండు వారాలకు ముందు టమాట ధర బాక్సు రూ.600 దాటింది. దిగుబడి సైతం ఆశించిన మేర అందుబాటులోకి రావడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రస్తుతం తెగుళ్ల కారణంగా పంట దిగుబడులు తగ్గినా మంచి ధరలుండడంతో నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చని రైతులు ఆశించారు. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో లోకల్ సరుకు సీజన్ మొదలు కావడంతో జిల్లా నుంచి ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. దీంతో బయటి వ్యాపారులు ఇక్కడి మార్కెట్లకు రాకపోవడంతో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ప్రస్తుతం పలమనేరు మార్కెట్‌లో 14కిలోల బాక్సు ధర గరిష్ఠంగా రూ.340 కనిష్ఠంగా రూ.300గా ఉంది.

వారంలోనే తగ్గుముఖం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, వి.కోట, సోమల, సదుంలో పెద్ద టమాట మార్కెట్లున్నాయి. అక్టోబర్ ఆఖరివారంలో టమాట బాక్సు ధర రూ.600కు పైగా పలికింది. ఈ వారం రోజుల్లో రూ. 340 నుంచి రూ.300కు తగ్గిపోయింది. ఈ ధరలు మరింత పడిపోయే అవకాశముందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

లేని ఎగుమతులు

సాధారణంగా జిల్లా నుంచి టమాటాలు ఈ సీజన్‌లో తెలంగాణ, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా, కోల్‌కత్తాతోపాటు బంగ్లాదేశ్‌కు కూడా ఎగుమతి చేస్తుంటారు. ఆయా రాష్ట్రాల్లో వారం రోజులుగా టమట సీజన్ మొదలైంది. దీంతో అక్కడి అవసరాలకు స్థానిక పంటే అందుబాటులో ఉంటోంది. దీంతో జిల్లా నుంచి ఎగుమతులు నిలిచిపోయాయి.

నష్టాలు తప్పవు



టమాట పంటను ఎకరాలో సాగు చేయాలంటే ఇప్పుడున్న ధరల్లో పెట్టుబడిగా రూ.2లక్షలు వరకు ఖర్చు వస్తుంది. కనీసం బాక్సు ధర రూ.400గా ఉంటే ఎకరానికి సగటున 800 బాక్సులు కోస్తే రూ.3.20 లక్షలు అందుతుంది. అదే ఇప్పుడున్న ధర రూ.300లకు అయితే రూ.2.40లక్షలు మాత్రమే గిట్టుబాటు అవుతుంది. ఈ ధరతో నష్టాలు తప్పవు. రైతుకు మిగిలేది ఏమీ ఉండదు.

– బాలచంద్రా రెడ్డి, రైతు, గంగవరం మండలం

అంచనా వేయలేం



టమాట ధరలు నిలకడగా ఉంటాయా లేదా అని ముందుగా అంచనా వేయలేం. ఎందుకంటే వాతావరణం కారణంగా ధరల్లో మార్పులు రావచ్చు. అయితే ఇప్పుడు ఇక్కడున్న పంట ఉత్పత్తి తక్కువగానే ఉంది. సాధారణంగా అయితే ధరలుండాలి. కానీ బయటి రాష్ట్రాల్లో సరుకు మొదలైతే ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గుతాయి. దీంతో ఇక్కడ ధరలు పడిపోతాయి.

– మండీ సుధా, మండీ నిర్వాహకుడు, పలమనేరు

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా!

- కౌండిన్య నదిని కొల్లగొడుతున్న కూటమి నేతలు
- ఉచితం ముసుగులో అనధికార డంప్‌లు


కొత్తపల్లె రోడ్డు తెట్టుమిట్ట గ్రామం సమీపంలో డంప్ చేసిన ఇసుక

గంగవరం : కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక మాఫియా ఇష్టారాజ్యంగా రెచ్చిపోతోంది. అక్రమార్జనే పరమావధిగా పేట్రేగిపోతోంది. అధికారంలోకి రాగానే కౌండిన్య నదిని కొల్లగొట్టేస్తోంది. ట్రాక్టర్ ఇసుకను రూ.3వేలకు పైగా విక్రయించేస్తోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీని అడ్డుపెట్టుకుని యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతోంది. కౌండిన్య నుంచి ఇసుకను తరలించి ఊరూరా శివారు ప్రాంతాల్లో అనధికారికంగా డంప్ చేసుకుంటోంది. అక్కడి నుంచి అక్రమంగా రవాణా చేస్తోన్నాయి.

పాలసీకి పరాకాష్ట

కూటమి నేతలే మాఫియా మారి ఇసుక అక్రమ రవాణాను ప్రధాన ఆదాయ వనరుగా మార్చేసుకున్నారు. ఎవరైనా గృహ నిర్మాణానికి ఇసుక కావాలంటే ముందుగా సచివాలయంలో అనుమతి తీసుకుని ట్రాక్టర్, ఎడ్ల బండిలో లోడ్ చేసుకుని తరలించుకోవాలి. ఇందులో యంత్రాలను వినియోగించకూడదు. అయితే కూటమి నేతలు మాత్రం ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జేసీబీలతో యథేచ్ఛగా ఇసుకను తవ్వేసి అమ్మేసుకుంటున్నారు.

తరిగిపోతున్న నిల్వలు

నదుల, వాగులు, వంకల్లో ఇసుక నిల్వలు పూర్తిగా తరిగిపోతున్నాయి. కూటమి నేతలకు మాత్రం ఇబ్బడిముబ్బడిగా కాసులు కురుస్తున్నాయి. ముఖ్యంగా గంగవరం మండలంలోని కూర్నిపల్లె, గంగవరం, జీఎల్ఎస్ ఫారమ్, దండపల్లె, గుండుగల్లు, పసుపత్తూరు, గంధ్రాజుపల్లె, మేలుమాయి క్రాస్, కలగటూరు తదితర గ్రామాలకు సమీపంలోని కౌండిన్య నది పరీవాహక ప్రాంతంతోపాటు చెరువులు, వంకల్లో ఇసుకను పూర్తిగా తవ్వేస్తున్నారు.

పొలిమేరల్లో డంపింగ్

మండలంలోని ఊరూరా పొలిమేర ప్రాంతాల్లో ఉన్న పొలాలు, బీడు భూముల్లో ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. గంగవరం బైపాస్, సోనీ దాబా వెనుక, తెట్టుమిట్ట, కలగటూరు, పసుపత్తూరు, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో ఇసుక డంప్‌లు భారీగా దర్శనమిస్తున్నాయి. ఒక్కోచోట వందకు పైగా ఇసుక లోడ్‌లను కూటమి నేతల ఆధ్వర్యంలో మాఫియా డంప్ చేసింది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

ఉపేక్షించే ప్రసక్తే లేదు



ఎక్కడైనా ఇసుక డంప్‌లను గుర్తిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఇసుకను అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నదులు, చెరువుల్లో జేసీబీలతో తవ్వకాలు చేపడితే కేసులు తప్పవు. ఇసుక స్మగ్లింగ్‌పై ఎలాంటి సమాచారం వచ్చినా వెంటనే చర్యలు చేపట్టాలని వీఆర్‌ఓలను ఆదేశించాం. ఇసుక కావాల్సినవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.

– శివకుమార్, తహసీల్దార్, గంగవరం

రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యం

- 150 రోజుల్లో వందకు పైగా హత్యలు, లైంగికదాడులు
- పవన్‌కల్యాణ్ ప్రశ్నించాల్సింది చంద్రబాబుని
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి


నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

పుత్తూరు: రాష్ట్రంలో శాంతిభద్రతలు వైఫల్యం చెందాయని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్‌తో ముఖ్యమంత్రికి తనకు ఎలాంటి సంబంధం లేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 150 రోజుల్లో వందకు పైగా హత్యలు, లైంగికదాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న పాలనను ప్రపంచమే మెచ్చుకుందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వంలో తెల్లవారితే ఏ వార్త వినాల్సి వస్తుందోనని భయపడే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్ ప్రశ్నించాల్సింది హోంమంత్రిని కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీయాలని సూచించారు. కులాలను టార్గెట్ చేసి, మంత్రులు, కలెక్టర్లను విమర్శించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఇచ్చే ఆదేశాల మేరకే అధికార యంత్రాంగం పనిచేస్తుందని గుర్తుపెట్టుకోవాలని కోరారు. ప్రజల ద్వారా నిజాయితీగా ఎన్నుకోబడి ఉంటే సక్రమంగానే పాలించేవారని, ఈవీఎం ట్యాంపరింగ్‌తో అధికారంలోకి రావడం వల్లే ఇలాంటి పరిపాలన అందిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించి ఆడబిడ్డల మాన ప్రాణాలు కాపాడాలని సూచించారు.

అక్రమ క్వారీల అడ్డాగా నగరి


నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు

నగరి : అక్రమ క్వారీలకు అడ్డాగా నగరి నియోజకవర్గం మారిపోయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజ్ ,సహాయ కార్యదర్శి డాక్టర్ టి.జనార్ధన్ విమర్శించారు. మంగళవారం నగరి ఆర్డీఓ కార్యాలయం వద్ద పట్టణ కార్యదర్శి వేలన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 22 చోట్ల మైనింగ్ జరుగుతోందన్నారు. అక్రమంగా ప్రక్క రాష్ట్రాలకు కంకర, మట్టి తరలిస్తూ రూ.కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మైనింగ్ జరిపేందుకు ఆ ప్రాంతవాసులతో సభ నిర్వహించి ఆమోదం పొందాల్సి ఉందని, అయితే అధికారులు ఇష్టారాజ్యంగా అనుమతులు మంజూరు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక మైనింగ్, పర్యావరణ అధికారుల ద్వారా సర్వే చేపట్టి అక్రమ క్వారీల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు శ్రీరాములు, షబ్బీర్‌బాషా, విజయ కుమార్, రాజేంద్ర , ఏసు, శేఖర్ పాల్గొన్నారు.

కాణిపాకానికి రెండు ఆర్టీసీ సర్వీసులు

- సత్యవేడుకు ఒక అదనపు సర్వీస్
- నేడు కొత్త సర్వీసులు ప్రారంభోత్సవం

తిరుపతి అర్బన్: కాణిపాకానికి నిత్యం భక్తుల రద్దీ ఉంటుందనే విషయం తెలిసిందే. ప్రస్తుతం తిరుపతి నుంచి కాణిపాకానికి 13 ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. భక్తుల రద్దీ నేపథ్యంలో కొత్తగా మరో రెండు ఎక్స్‌ప్రెస్‌లను బుధవారం నుంచి ఆర్టీసీ అధికారులు అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతి నుంచి ఉదయం 8 గంటలకు ఒక సర్వీస్, 8.15 గంటలకు మరో సర్వీస్ ఏర్పాటు చేశారు. అలాగే మధ్యాహ్నం 12.30 గంటలకు ఒకటి, 12.45కు మరో సర్వీసు, సాయంత్రం 4.45 గంటలకు ఒకటి, 5 గంటలకు మరో సర్వీసును ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా తిరుపతి డిపో నుంచి సత్యవేడుకు ఇప్పటి వరకు ఒక బస్సు మాత్రమే ఉండేది. బుధవారం నుంచి అదనంగా మరో కొత్త సర్వీస్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 6 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరుతుంది. అలాగే మధ్యాహ్నం 1 గంటకు తిరుపతి నుంచి సత్యవేడుకు బయలుదేరుతుంది.

టీడీపీ కార్పొరేటర్‌తోపాటు ఇద్దరిపై కేసు

చిత్తూరు అర్బన్: ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమయ్యారనే ఆరోపణలపై చిత్తూరు నగరంలోని టీడీపీ కార్పొరేటర్, మరో ఇద్దరిపై పోలీసులు మంగళవారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. చిత్తూరు అశోకపురానికి చెందిన హరికృష్ణ (52) నాలుగు రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించాడు. ఆ సమయంలో తన చెల్లెలు శోభారాణికి ఫోన్ చేసి మాట్లాడాడు. అనంతరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అయితే తన అన్న చనిపోయేప్పుడు సూసైడ్‌నోట్ తన ఫోన్‌కు పంపాడని, అందులో హరికృష్ణ చావుకు కారణం బాలాజీ, కార్పొరేటర్ ఇందు, ఏకాంబరం అని పేర్కొన్నట్లు శోభారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ లోను యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దు

చంద్రగిరి: బ్యాంకు లోను అందిస్తామంటూ సెల్‌ఫోన్‌లకు వచ్చే యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా మీ వ్యక్తిగత సమాచారం చోరీకి గురవుతుందని, అటువంటి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకూడదని హైదరాబాద్‌కు చెందిన సైబర్ క్రైం నిపుణుడు నరసింహారావు సూచించారు. సైబర్ క్రైం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీసాయినాథ నగర్‌లో గల మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్‌పోర్టు, బ్యాంకు ఖాతా నంబరు, పాన్‌కార్డు వివరాల పట్ల అప్రమత్తతగా వ్యవహరించాలన్నారు.

అటకెక్కిన నిధుల స్వాహా కేసు?


కాంట్రాక్ట్ ఉద్యోగి సునీల్

పుంగనూరు: స్థానిక మండల సచివాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి సునీల్ రూ.1.36 కోట్లు స్వాహా చేసిన కేసును పోలీసులు అటకెక్కించినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జూన్ 20వ తేదీన వెలుగు చూసిన కేసులో అప్పటి జెడ్పీ సీఈఓ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ నారాయణ, ఏఓ రాజేశ్వరిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు కూడా వేసింది. అయితే అసలు సూత్రధారి సునీల్ మాత్రం అప్పటి నుంచి పరారీలో ఉన్నట్లు ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే సునీల్‌ను ప్రధాన నిందితుడుగా, ఎంపీడీఓ, ఏఓను సహ నిందితులుగా కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో పోలీసుల దర్యాప్తు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రధాన నిందితుడైన సునీల్ మాత్రం పుంగనూరు పట్టణంలో బాహాటంగా తిరుగుతున్నాడు. అయినప్పటికీ ఇటు పోలీసులు, అటు మండల పరిషత్ అధికారులు పట్టించుకోవడం లేదు. నిందితుడికి అధికార పార్టీ అండం ఉందని ప్రచారం సాగడంతో రూ.1.36 కోట్ల స్వాహా కేసును పోలీసులు బుట్టదాఖలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎమ్మార్పీ ధరకే మద్యం విక్రయాలు


ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

కుప్పం : ప్రభుత్వ నిబంధనల మేరకు ఎమ్మార్పీ ధరకే జిల్లాలో మద్యం విక్రయాలు సాగిస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిర్దేశిత రేటుకు మించి మద్యం అమ్మితే సంబంధిత షాపు యాజమాన్యంపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి మద్యం దుకాణం వద్ద ధరల పట్టికతోపాటు టోల్ ఫ్రీ నంబర్ సైతం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మద్యం అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే బెల్ట్‌షాపు నిర్వహిస్తే కేసులు తప్పవని స్పష్టం చేశారు. బెల్టుషాపులకు మద్యం తరలించే వైన్‌షాపు యాజమాన్యంపై కేసులు నమోదు చేసి, స్టాక్ పంపిణీ మీద కూడా ఆంక్షలు విధిస్తామని తెలిపారు. కర్ణాటక మద్యం జిల్లాలోకి రాకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఇంటిలిజెన్స్ అధికారులు సైతం నిఘా ఉంచారని వివరించారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐ మోహన్ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సరెండర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), జనన మరణ ధృవీకరణ పత్రాల సహాయ గణాంక అధికారి నరసింహను మాతృశాఖకు సరెండర్ చేస్తూ కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు డీఎంహెచ్ఓకు లేఖ పంపించారు. నరసింహ స్థానంలో నగరపాలక సంస్థకు మరొకరిని నియమించాలని పేర్కొన్నారు.

రెవెన్యూలో అక్రమాలపై రహస్య విచారణ

కుప్పం : కుప్పం రెవెన్యూశాఖలో జరిగిన అక్రమాలపై అధికారులు రహస్య విచారణకు శ్రీకారం చుట్టారు. ఇటీవల కొందరు రెవెన్యూ సిబ్బంది నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి భారీగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు అధికారుల దృష్టికి వెళ్లిన విషయం విదితమే. ఇందుకు సంబంధించి ఓ ఉద్యోగిని కలెక్టరేట్‌కు సరెండర్ కూడా చేశారు. దీనిపై రెండు రోజులుగా రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ప్రధానంగా అనుభవ ధ్రువీకరణ ప్రతాలను ఇష్టానుసారం పంపిణీ చేశారని గుర్తించినట్లు తెలిసింది. పడుతున్నాయి. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు కొంత మంది అనుభవ ధ్రువీకరణ పత్రాల కొనుగోలులో ప్రధాన పాత్ర పోషించినట్లు సమాచారం. కుప్పం సమీపంలోని దళవాయి కొత్తపల్లె వద్ద పలార్లపల్లె రెవెన్యూ పరిధిలో ఇంటి పట్టాల విక్రయాలతో భారీగా నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది. రెవెన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడి ఒకే కుటుంబానికి నాలుగు ఇంటి పట్టాలు అందించినట్లు సమాచారం. మిగులు భూముల విషయంలో కూడా కంప్యూటర్ సెక్షన్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి రైతుల నుంచి సొమ్ము పిండుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసినట్లు అధికారులు కనిపెట్టారని తెలుస్తోంది. ఓ సొసైటీకి సంబంధించిన ఆస్తిని రెవెన్యూ ఉద్యోగి కొనుగోలు చేసి నిర్మిస్తున్న భవనాలపై కూడా సమగ్ర విచారణ చేపట్టినట్లు సమాచారం.

చిత్తూరు కార్పొరేషన్‌లో బదిలీ చిచ్చు!

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇద్దరు అధికారుల మధ్య బదిలీ చిచ్చు పెట్టింది. వివరాలు.. నగరపాలక సంస్థలో ప్రజారోగ్యశాఖ అధికారిగా (ఎంహెచ్ఓ) డాక్టర్ అనిల్‌కుమార్ కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో కొత్తగా డాక్టర్ లోకేష్‌ను నియమిస్తూ అక్టోబర్ చివరి వారంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే డాక్టర్ అనిల్‌కుమార్‌ను రిలీవ్ చేయాలని అందులో లేదు. దీంతో రెండు రోజులుగా లోకేష్ హాజరు పట్టీలో సంతకం పెడుతున్నారు. మంగళవారం సచివాలయ పారిశుధ్య కార్యదర్శులతో సమావేశం కూడా నిర్వహించారు. మరోవైపు డాక్టర్ అనిల్‌కుమార్ కూడా కార్యాయానికి వచ్చి వెళుతున్నారు. ఆయన బయటకు వెళుతూ చాంబర్‌కు తాళాలు వేసేస్తున్నారు. దీంతో ఎవరు అసలైన ఎంహెచ్ఓ..? తాము ఎవరి మాట వినాలి..? అర్థంకాక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

క్షతగాత్రుడికి అందని వైద్యం


ఆస్పత్రిలో బాధితుడు తేజ నాయక్

పుంగనూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోడ్డు ప్రమాద బాధితుడికి ఉదయం నుంచి సాయంత్రం వైద్యం అందలేదు. దీనిపై క్షతగాత్రుడి తల్లి నీలానాయక్ మండిపడడంతో వైద్య సిబ్బంది తూతూమంత్రంగా చికిత్సలందించారు. వివరాలు.. మండలంలోని నల్లగుట్లపల్లెకు చెందిన తేజ నాయక్(25) ద్విచక్రవాహనంలో పలమనేరుకు వెళుతూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన తేజ నాయక్‌ను స్థానికులు వెంటనే 108లో పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యులు, నర్సులు ఒకరిపై ఒకరు వంతులు వేసుకుని సాయంత్రం వరకు క్షతగాత్రుడికి చికిత్సలందించలేదు. అదే సమయంలో అక్కడకు విలేకర్లు వెళ్లడంతో హుటాహుటిన బాధితుడికి వైద్యం అందించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై క్షతగాత్రుడి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారిని ఫోన్‌లో వివరణ కోరగా.. ఆయన స్పందిస్తూ క్షతగాత్రుడికి బీపీ అధికంగా ఉండడం వల్లే సెలైన్ కూడా పెట్టలేదన్నారు. అయితే అప్పటికే ఎక్స్‌రేతోపాటు వైద్యసేవలు అందించినట్లు వెల్లడించారు.

ఎస్వీడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న వీసీ సీహెచ్ అప్పారావు

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ మహిళల అంతర కళాశాలల టోర్నమెంట్ వర్సిటీ క్రీడామైదానంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వర్సిటీ పరిధిలోని పలు కళాశాలల విద్యార్థినులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. వాలీబాల్ పోటీలో ఎస్వీ డబ్ల్యూ విద్యార్థినుల జట్టు విజేతగా నిలవగా, మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. అలాగే ఖోఖో మ్యాచ్ విన్నర్స్‌గా ఎస్వీడబ్ల్యూ కళాశాల జట్టు నిలువగా, రన్నరప్‌గా ఎస్వీయూ కళాశాల విద్యార్థినులు నిలిచారు. బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల జట్టు విజేతగా నిలువగా, తిరుపతి ఎస్వీడబ్ల్యూ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. గెలుపొందిన జట్లకు ఎస్వీయూ వీసీ అప్పారావు ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాదమరి(పూతలపట్టు): మండలంలోని పెరుమాళ్లపెంటకు చెందిన టీడీపీ నేత మునిరత్నం బైక్‌పై మంగళవారం యాదమరి నుంచి ఇంటికి వెళుతుండగా అదుపుతప్పి కింద పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోడ్డులో గుంతల కారణంగా ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.